సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం



చెక్కులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

గౌతంనగర్: సీఎం సహాయనిధి నిరుపేదల పాలిట వరంలాంటిదని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన గౌతంనగర్ డివిజన్ ఇందిరానెహ్రూనగర్‌కు చెందిన మల్లేష్‌కు రూ.60 వేలు, వీరస్వామికి రూ.42 వేల చెక్కులను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వెంకటేష్‌యాదవ్, బికె.శ్రీనివాస్, నాగరాజు, రాజు, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు



బాబానగర్ కాలనీ నూతన కార్యవర్గం

మల్లాపూర్: మల్లాపూర్ బాబానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జలగం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా వెల్పుల భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా ఉమా, సంయుక్త కార్యదర్శి వెంకటేష్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా వేణు, వెంకటేష్, కోశాధికారిగా జయరాం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాగరాజు, సలహాదారులుగా శైలేష్ రెడ్డి, నాగేందర్, ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు జలగం శ్రీనివాస్ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి పాటుపడతానన్నారు.

ఘనంగా హనుమత్ వ్రతం



పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మారుతీనగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం హనుమత్ వ్రతం ఘనంగా జరిగింది. అర్చకులు శ్యామ్‌ప్రసాద్‌శర్మ, తులసి రమణాచార్యులు, ముడుంబై వేంకటరమణాచార్యుల ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు విశేష పంచామృతాభిషేకం, అలంకరణ, అర్చన అనంతం వ్రతం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓలు శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, క్లర్స్ సుధాకర్, కార్పొరేటర్ శ్రవణ్,అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లిబరేషన్ పార్టీ బలోపేతానికి కృషి



లిబరేషన్ పార్టీలో చేరిన బోట్ల శ్రీనివాస్

మల్లాపూర్: లిబరేషన్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని నాచారం ప్రాంతానికి చెందిన సీపీఐ నాయకుడు బోట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన లిబరేషన్ పార్టీ చేరారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రాజా ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ లిబరేషన్ పార్టీని బలోపేతం చేస్తానన్నారు.ప్రజా ఉద్యమాల సారధిగా అణ గారిన తరగతుల ప్రజల కోసం పోరాడతానని తెలిపారు. కార్యక్రమంలో లిబరేషన్ కాప్రా సర్కిల్ ఇన్‌చార్జి మహంకాళి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిఖిల్ మూర్తికి మెడికల్ ఆస్ట్రాలజీలో గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న నిఖిల్‌మూర్తి

బోడుప్పల్: వాసవీనగర్‌కు చెందిన నిఖిల్ మూర్తి మెడికల్ ఆస్ట్రాలజీలో గౌరవ డాక్టరేట్ పొందారు. బెంగుళూరులోని శుక్రాచార్య వేదాంగ్ యూనివర్సిటీ ఈ అవార్డును ప్రకటించింది. ఈమేరకు తిరుమల తిరుపతి దేవస్థానం మహతి ఆడిటోరియంలో జరిగిన ఆస్ట్రాలజీ అవార్డ్స్ ప్రదానోత్సవ కార్యక్రమంలో రంగాచారి, టీటీడీ మాజీ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ నారాయణ చేతుల మీదుగా ఆయన డాక్టరేట్ అందుకున్నారు. అనంతరం నిఖిల్ మూర్తి మాట్లాడుతూ మెడికల్ ఆస్ట్రాలజీలో తాను చేసిన సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ రావడం ఆనందంగా ఉందన్నారు.

నిత్యావసర వస్తువులు, చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

గౌతంనగర్: లయన్స్ క్లబ్ గౌతంనగర్ ఆధ్వర్యంలో శుక్రవారం జ్యోతినగర్‌లోని సన్నిత అనాథ ఆశ్రమంలో బాలబాలికలకు నిత్యావసర సరుకులు, నేరేడ్‌మెట్‌లోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజమౌళి, డాక్టర్ ఎస్పీ భారతి, యమున, పాఠక్, కుప్పుస్వామి, పార్వతి, ధనుంజయ్, రాఘవేంద్రరావు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ రేట్ల పెంపు..?

జనవరి నుంచి పెరిగే అవకాశం
- కాలనీవాసులకు పారిశుద్ధ్య ఆటోల నిర్వాహకుల సమాచారం
- ఒక్కో ఇంటిపై రూ.20 నుంచి రూ. 30 అదనపు భారం



కాప్రా సర్కిల్ కార్యాలయం

కాప్రా: ఇంటింటా చెత్త సేకరించే ఆటోల నిర్వాహకుల చార్జీలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. జనవరి నుంచే పెంచిన రేట్లు అమలులోకి వస్తాయని వారు ఆయా కాలనీల ప్రజలకు చెబుతున్నారు. ప్రస్తుతం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒక్కో ఇంటి నుంచి రూ. 120, మొదటి, రెండో అంతస్తుల్లో రూ. 120 నుంచి రూ. 150 వరకు తీసుకుంటున్నట్లు మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. గతంలో రూ. 60 నుంచి రూ. 100 వరకు వసూలు చేసేవారు. తర్వాత రూ. 80 నుంచి రూ. 150 వరకు పెంచారు. ఇప్పుడు నూతన ఏడాదిలో కొత్త రేట్లు అమల్లోకి వస్తాయని..దాని ప్రకారమే చెల్లించాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం గ్రౌండ్ ఫ్లోర్‌లో రూ. 120 చెల్లించే వారు జనవరి నుంచి రూ. 140 నుంచి రూ. 150 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా అంతస్తులు పెరిగినా కొద్దీ వారు అదనంగా రూ. 20 నుంచి రూ. 30 వరకు భారం పడనుంది.

నిరుపేదలపై భారం..

డబ్బున్నవారికి, ఇతరులు ఈ పెంచిన రేట్లు పెద్దగా భారం అని అనుకోరు. కానీ నిరుపేదలు, రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబాలు నెలసరి ఖర్చుల్లో రూ. 10 పెరిగినా వారి భారంగానే ఉంటుంది.

వారి కష్టం వెలకట్టలేనిది..

పారిశుద్ధ్య కార్మికులు, ఇంటింటా చెత్త సేకరించే ఆటో నిర్వాహకుల సేవలు వెలకట్టలేనివని, వారు నిత్యం ఇంటింటికీ తిరుగుతూ చెత్తను తీసుకెళ్తున్నారు. వీరికిచ్చే డబ్బులు చాలా తక్కువని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రూ. 120, రూ. 150 అయినా సరే వారు చేసే కష్టానికి తక్కువే అని పేర్కొంటున్నారు.

నాలుగేళ్ల నుంచి పెంపు లేదు..

ఇంటింటికీ తిరిగి చెత్త సేకరిస్తున్నాం. నిత్యావసరాల రేట్లు కూడా చాలా పెరిగిపోయాయి. నాలుగేళ్లుగా రేట్లు పెంచలేదని పలువురు చెత్త సేకరించే ఆటోల నిర్వాహకులు పేర్కొంటున్నారు. వచ్చే జనవరి నుంచి ఇంటింటికీ రూ. 20 చొప్పున పెంచుతున్నామని చెబుతున్నారు.

జీహెచ్‌ఎంసీదే బాధ్యత..

చెత్త సేకరణ జీహెచ్‌ఎంసీ బాధ్యతని పలువురు పేర్కొంటున్నారు. చెత్త సేకరించే ఆటోల నిర్వాహకులకు జీహెచ్‌ఎంసీ నుంచే డబ్బులు చెల్లించేలా చూడాలని వారు అభిప్రాయం పడుతున్నారు. కొన్ని చోట్ల చెత్త సేకరణ సరిగ్గా జరగడం లేదని, నాలుగైదు రోజులకు ఒకసారి చెత్త సేకరించేందుకు వెళ్తుండడంతో కొన్ని కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్త సేకరించే ఆటోలపై జీహెచ్‌ఎంసీ అధికారుల పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడంతోనే కొన్ని చోట్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పలువురు వాపోతున్నారు.

అధికారికంగా ఆదేశాలు రాలేదు..

ఇంటింటా చెత్త సేకరించే ఆటోల నిర్వాహకుల రేట్లు పెంచాలని ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఈ విషయంపై సిబ్బందితో చర్చించి ఆటో నిర్వాహకులకు ఆదేశాలిస్తాం. ప్రస్తుతం నడుస్తున్న విధంగానే రేట్లు కొనసాగుతాయి.

-ప్రశాంత్, హెల్త్ అండ్ శానిటరీ సెక్షన్ హెడ్

వైభవంగా శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



హోమం, పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అల్వాల్: ఓల్డ్ అల్వాల్‌లోని శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం శ్రీవారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి పల్లకిలో పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమానికి నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ జాతీయ అధ్యక్షుడు నెల్లి గురుదేవ్, జిపి.నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌మూర్తి హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో యజ్ఞాచార్యులు విజయసారథి, అర్చకులు రఘు, శ్రీనివాస్, రమణ, ఆలయ సిబ్బంది, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్, స్వామి, సేవకులు వెంకటరామిరెడ్డి, సురేందర్‌రెడ్డి, శివరామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

కాప్రా ఏఎంహెచ్‌ఓగా మధుసూదన్ రావు



కాప్రా: జీహెచ్‌ఎంసీ కాప్రా సర్కిల్ ఏఎంహెచ్‌ఓగా మధుసూదన్ రావు నియమితులయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా, రాజాపూర్ పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న ఆయన డిప్యూటేషన్‌పై జీహెచ్‌ఎంసీకి బదిలీ అయ్యారు. బదిలీపై వచ్చిన మధుసూదన్ రావును కాప్రా సర్కిల్ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్‌గా నియమిస్తూ జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం కాప్రా సర్కిల్ ఏఎంహెచ్‌ఓగా ఆయన బాధ్యతలు స్వీకరించారు.

పార్టీ బలోపేతానికి సమష్టి కృషి

మల్లాపూర్: భారతీయ జనతా పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు, జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి తల్లోజు ఆచారి అన్నారు. శుక్రవారం నాచారంలో ఉప్పల్ నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి పాతగాని గోపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి తల్లోజు ఆచారి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీ ఎస్ఎస్ ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లాలోనే ఉప్పల్ నియోజక వర్గం సభ్యత్వ నమోదులో ముందంజలో ఉందన్నారు. బూత్‌కమిటీ, డివిజన్ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సభ్యత్వ నమోదును ప్రతి ఒక్కరు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరి వర్ధన్‌రెడ్డి, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు నర్సింగ్ రావు, కన్వీనర్ బాలచందర్, సతీష్ కుమార్, మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, ఎన్నికల సహఇన్‌చార్జి బాల కృష్ణ, ఎస్టీ మోర్చా పధాన కార్యదర్శి రవినాయక్, కార్పొరేటర్ బండారు శ్రీవా ణి తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రహదారుల పరిశీలన



అంతర్గత రోడ్లను పరిశీలిస్తున్న అధికారులు

కాప్రా: కాప్రా డివిజన్‌లో మరమ్మతులకు గురైన అంతర్గత రోడ్లను శుక్రవారం జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పరిశీలించారు. ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన అంతర్గత రోడ్లు అధ్వానం కథనానికి స్పందించిన అధికారులు బంజారా కాలనీలో రోడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేందర్, డిప్యూటీ ఇంజనీర్ బాలకృష్ణ, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

అల్వాల్: వనమహోత్సవంలో భాగంగా మచ్చబొల్లారం డివిజన్ సాయిబృందావన్ కాలనీలోని పార్కులో నీటి వసతి కోసం ఏర్పాటు చేసిన బోర్‌వెల్‌ను శుక్రవారం కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్, హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ పద్మనాభం, అధికారిణి ప్రవీణ, నవీన్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పార్కులో వాకింగ్ ట్రాక్, గ్రీనరీ ఏర్పాటుచేసి కాలనీవాసులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జోగిరాజు, ఎల్లారెడ్డి, రఘుపతిరెడ్డి, కొండల్‌రెడ్డి, రాజిరెడ్డి, రామిరెడ్డి, రాఘవశర్మ, శ్రీనాథ్, నాయకులు బొబ్బిలి సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీశైలం యాదవ్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.



పార్కులో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ తదితరులు

ముగిసిన ఎడ్యుకేషన్ ఎక్స్ పో



నమూనాలను తిలకిస్తున్న రవీందర్‌సాగర్

మల్లాపూర్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఎడ్యుకేషన్ ఎక్స్‌పోలు ఎంతగానో దోహదపడతాయని ఉప్పల్ నియోజకవర్గ బీజేపీ ఎంబీసీ చైర్మన్ సంగిశెట్టి రవీందర్ సాగర్ అన్నారు. శుక్రవారం ఆయన మల్లాపూర్ కస్తూర్బా పాఠశాలలో ఎడ్యుకేషన్ ఫెయిర్, ఎక్స్‌పో ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు తయారు చేసిన అనేక ఎగ్జిబిట్‌లను తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఇంతియాజ్ బేగం,చైర్మన్ మహ్మద్ ఇస్మాయిల్ తది తరులు పాల్గొన్నారు.

వేడి నీళ్లు పడి బాలుడి మృతి



దివ్యాన్ష్ (ఫైల్)

అల్వాల్: వేడి నీళ్లు పడి ఓ బాలుడు (02) మృతి చెందిన సంఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అల్వాల్ ఎస్ఐ సురేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మచ్చబొల్లారం గోపాల్‌నగర్‌కు చెందిన ఆనంద్ ఈ నెల 8న నడుమునొప్పి రావడంతో ఉపశమనం కోసం వాటర్ హాట్ ప్యాడ్‌ను నడుముకు కట్టుకుని బోర్లా పడుకున్నాడు. అదే సమయంలో పరిగెత్తుకుంటూ వచ్చిన అతడి కుమారుడు దివ్యాన్ష్ (02) తండ్రిపై దూకాడు. దీంతో వీపుపై ఉన్న వాటర్ హాట్ ప్యాడ్ పగిలి వేడి నీళ్లు చిన్నారిపై పడ్డాయి. తీవ్రంగా గాయపడిన దివ్యాన్ష్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా సర్వీసులను అందుబాటులోకి తేవాలి



రవాణా శాఖ మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న వజ్రేశ్‌యాదవ్, యాదగిరియాదవ్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పట్టణంలోకి జిల్లా బస్సులు నడిపించాలని కోరుతూ మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ శుక్రవారం రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రైల్వే బ్రిడ్జీ పనుల కారణంగా జిల్లా బస్సులు బైపాస్ రోడ్డుమీదుగా వెళుతున్నాయని, దీంతో రాత్రి వేళల్లో పట్టణానికి చేరుకునేందుకు వృద్ధులు, మహిళలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గతంలో మాదిరిగానే యాదగిరిగుట్ట, వరంగల్, జనగాం. పికెట్ బస్సులు తిరిగి నడిపించాలని కోరారు.

జేపీ ఆసుపత్రి అనుమతులు రద్దు

మేడిపల్లి: మేడ్చల్ జిల్లా, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్, కెనరానగర్ కాలనీలోని జేపీ ఆసుపత్రి అనుమతులను రద్దు చేసినట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్. రఘునాథ్ స్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఈఏ చట్టం ప్రకారం, గర్భ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం, అబార్షన్లు చేయడం, భద్రతా ఏర్పాట్లు లేకపోవడం తదితర ఆరోపణలపై షోకాజ్ నోటీసులు జారీ చేసినా ఆసుపత్రి నిర్వాహకులు పట్టించుకోనందుకు గాను ఆసుపత్రి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసినట్లు తెలిపారు. ఆదేశాలకు విరుద్ధంగా ఆసుపత్రిని నిర్వహిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సమస్యలను పరిష్కరించండి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీబీఆర్ కాలనీవాసులు

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని బీబీఆర్ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కాలనీ అసోసియేషన్ సభ్యులు క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో పాత విద్యుత్ పోల్స్ ప్రమాదకరంగా మారాయని, వాటి స్థానంలో సిమెంట్ పోల్స్ ఏర్పాటు చేయాలని, కుంగిపోయిన మ్యాన్‌హోల్ కవర్లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని, సీసీ రోడ్డు మంజూరు చేయించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ మచ్చబొల్లారం డివిజన్ అభివృద్ధికి జీహెచ్‌ఎంసీ అధికారులకు ఇదివరకే ప్రతిపాదనలు పంపామన్నారు. నిధుల కొరతతో ప్రభుత్వం అభివృద్ధి పనుల ప్రతిపాదనలను మంజూరు చేయడంలో జాప్యం చేస్తుందన్నారు. కార్యక్రమంలో విజయానంద్, నర్సింగ్‌రావు, దుర్గారావు, విజయభాస్కర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

బోడుప్పల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని కార్పొరేటర్లు బింగి జంగయ్య యాదవ్, కొత్త చందర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం చెంగిచర్ల ధరణి కాలనీలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో మలక్ పేట్ యశోద హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సుఖవంతంగా ఆనందంగా జీవించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు బీపీ, షుగర్, కంటి పరీక్షలు, దంత పరీక్షలు, ఈసీజీ, చర్మవ్యాధులు, ఎముకల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రవణ్‌కుమార్‌రెడ్డి, అనిల్ అయ్యం గార్, నేతలు రంగ బ్రహ్మాన్‌గౌడ్, కొత్త రవిగౌడ్, కొత్త ప్రభాకర్‌గౌడ్, కుర్రి శివశంకర్, పాఠశాల ప్రిన్సిపాల్ నీలిమా, వైస్ ప్రిన్సిపాల్ ఉషా, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటాలి



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న కౌశిక్‌రెడ్డి

బోడుప్పల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలని బచ్‌పన్ అకమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ టెక్నికల్ డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ కౌశిక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బోడుప్పల్ బచ్‌పన్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన ఇంటర్ స్కూల్ కాంపిటేషన్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్నతనం నుంచి పోటీతత్వాన్ని పెంపొందించేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రీ ప్రైమరీ విద్యార్థులకు స్పోర్ట్స్, ఫైన్ ఆర్ట్స్, లిటరసీ విభాగాల్లో పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలు, ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీలిమాదేవి, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ ఆటోలపై నిరంతర నిఘా



సాకేత్ సమీపంలోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

కాప్రా: సర్కిల్ పరిధిలోని కాలనీల్లో ఇంటింటికి తిరిగి చెత్త సేకరించే ఆటోలను పర్యవేక్షించేందుకు సాకేత్ సమీపంలోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ద్వారా ఆటో నుంచి వచ్చే చెత్త డంపింగ్, అక్కడి నుంచి డంపింగ్ యార్డుకు తరలించే లోడింగ్, అన్‌లోడింగ్ విధానాన్ని పర్యవేక్షించనున్నారు. ఒక్కో ఆటో ఎన్ని ట్రిప్పులు తీసుకొస్తున్నారు, డంపింగ్ కోసం ఎంత సమయం పడుతుంది, ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు వచ్చే ముందు చెత్త రోడ్లపై పడకుండా టార్పాలిన్ కవర్‌తో ప్యాక్ చేస్తున్నారా లేదా, ఆటోల్లో బాల కార్మికులు పని చేస్తున్నారా అనే విషయాలను గుర్తించేందుకు ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిట్లు జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది అంజలి, ట్రాన్స్‌ఫర్ స్టేషన్ సూపర్ వైజర్ చందు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పను భక్తితో పూజిస్తే అన్ని శుభాలే



అయ్యప్ప పూజల్లో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: అయ్యప్ప స్వామిని భక్తితో పూజిస్తే మనం చేయబోయే పనుల్లో విజయం సాధిస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం నాచారం అన్నపూర్ణ కాలనీ పార్క్‌లో రవీందర్ యాదవ్ 18వ మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెనోఖర్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, మల్లేష్ యాదవ్, విఠల్ యాదవ్,బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. శుక్రవారం ఏదులాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో నిర్వహించిన ''వాయిస్ ఫర్ బాయ్స్'' కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు విద్యకు అధిక సమయం కేటాయించి ప్రభుత్వం, తల్లితండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ భాషా, లోహిత్, నాగరాజు, అమరేందర్, సాయిచరణ్‌రెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.